సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



అర్జీలను పరిశీలించాలి

గ్రీవెన్స్ డేలో ప్రజలు ఇచ్చే అర్జీలను నిశితంగా పరిశీలించి పరిష్కారానికి పాటుపడాలని కలెక్టర్ ప్రియాంక ఆల సూచించారు. 8లో



.. వారసత్వాన్ని కొనసాగించాలి

సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజాసమస్యలపై ప్రశ్నించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపునిచ్చారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 24°

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

అధ్యాపకుడికి డాక్టరేట్



వెంకట్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల అధ్యాపకుడు అమరబాదు వెంకట్‌కు డాక్టరేట్ లభించింది. కామర్స్ అధ్యాపకుడైన ఆయన స్టాక్ మార్కెటింగ్ అంశంపై సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి గాను మధ్యప్రదేశ్‌లోని శ్రీకృష్ణ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా వెంకట్‌ను కళాశాల ప్రిన్సిపల్ కె.హవీలా, అధ్యాపకులు, ఉద్యోగులు అభినందించారు.

17న పతాకాన్ని ఆవిష్కరించనున్న విప్ రేగా

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 17న నిర్వహించనున్న తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులకు సోమవారం ఆదేశాలు జారీ చేసింది.

కేటీపీఎస్ ఏడో దశలో ఉత్పత్తి పునరుద్ధరణ

పాల్వంచ : కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారంలో విద్యుదుత్పత్తిని సోమవారం పునరుద్ధరించారు. ఆదివారం బాయిలర్ ట్యూబ్ లీకేజీతో 12వ యూనిట్‌లో 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. దీంతో సీఈ పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరమ్మతులు పూర్తి చేసి ఉత్పత్తిని రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

స్పౌజ్‌కు దూరంగా కోరుకుంటే చర్య తప్పదు



కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు వినియోగించుకునే దంపతులు స్పౌజ్ పని చేస్తున్న పాఠశాలకు దగ్గరగా ఉన్న ఖాళీలను మాత్రమే వెబ్ ఆప్షన్‌లలో ప్రాధాన్య క్రమంలో ముందుగా కోరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దగ్గర స్థానం వదిలి దూరంగా ఉన్న పాఠశాలను కోరుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దంపతులిద్దరూ లాంగ్ స్టాండింగ్ పూర్తి చేసుకున్నట్టయితే స్పౌజ్ పాయింట్లు ఎక్కడైనా కోరుకోవచ్చని వివరించారు.

రోస్టర్ రిజిస్టర్ తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో సోమవారం సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ చీఫ్ లైజన్ ఆఫీసర్లతో కూడిన 9 మంది బృందం సోమవారం రోస్టర్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఈ సెల్‌కు సంబంధించిన పదోన్నతుల వివరాలను డీజీఎం పర్సనల్ విలాస్ శ్రీనివాస్ పోత్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ చీఫ్ లైజన్ ఆఫీసర్, మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, అసోషియేషన్ ప్రెసిడెంట్ రాజేశ్వరరావుతోపాటు ఆంతోటి నాగేశ్వరరావు, తిరుపతి, చంద్రశేఖర్‌రావు, మాలకొండయ్య, బి.గట్టుస్వామి, ఎం.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, రమేష్‌కుమార్, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు సెమీ ఫైనల్ !

తెరపైకి సింగరేణి 'గుర్తింపు' పోరు

- సార్వత్రిక ఎన్నికల ముందు అందరికీ సవాలే..
- అభ్యర్థులకు కీలకం కానున్న ఎలక్షన్లు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. అక్టోబర్‌లో ఎన్నికలు జరిపేందుకు కేంద్ర కార్మిక శాఖ చకచకా అడుగులు వేస్తోంది. మరోవైపు ఎన్నికల బరిలో నిలిచేందుకు కార్మిక సంఘాలు, వాటికి దన్నుగా నిలుస్తున్న రాజకీయ పక్షాలు రెడీ అవుతున్నాయి.

సాధారణానికి ముందే..

ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం తెలంగాణ అసెంబ్లీకి నవంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అయితే అంతకంటే ముందే అక్టోబర్ చివరి వారంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర కార్మిక శాఖ సోమవారం జరిగిన సమావేశంలో ప్రాథమికంగా నిర్ణయించింది. దీనికి ఇటు కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యం సైతం సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఈ అంశంపై ఈనెల 22న జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు. అప్పుడు అనూహ్య పరిణామాలు చోటు చేసుకోకుంటే అక్టోబర్‌లో గుర్తింపు ఎన్నికలు తథ్యం. అదే జరిగితే గుర్తింపు సంఘం ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలకు సెమీ ఫైనల్‌లా రాజకీయ పార్టీలు పరిగణించక తప్పదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పొలిటికల్ పవర్

సింగరేణిలో 15 కార్మిక సంఘాలు యాక్టివ్‌గా పని చేస్తున్నాయి. ఇందులో రాజకీయ పార్టీలకు అనుబంధంగా కొనసాగుతున్న గుర్తింపు సంఘాలు సంస్థలో కీలకంగా ఉన్నాయి. బీఆర్‌ఎస్‌కు అనుబంధంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉంది. కాంగ్రెస్‌కు ఐఎన్‌టీయూసీ, సీపీఐకి ఏఐటీయూసీ, సీపీఎంకు సీఐటీయూ, బీజేపీకి బీఎంఎస్, సీపీఐ(ఎంఎల్)కు ఐఎఫ్‌టీయూ తదితర సంఘాలు పని చేస్తున్నాయి. ఆరంభంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ వంటి పార్టీలకు అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాలు సింగరేణిలో నామ్ కే వాస్తే అన్నట్టుగానే ఉండేవి. కమ్యూనిస్టు అనుబంధ కార్మిక సంఘాల హవా నడిచేది. గడిచిన రెండు దశాబ్దాలుగా ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రధాన రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాలు విజయఢంకా మోగించడం మొదలెట్టాయి. ఈ ట్రెండ్ క్రమంగా పెరుగుతూ వచ్చి కార్మిక సంఘాల గెలుపోటములు ఆయా నియోజకవర్గాల్లోని ప్రధాన పార్టీల బలాబలాలకు ప్రతిబింబాలుగా మారాయి.

సత్తా చాటాల్సిందే..

జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల పరిధిలో సింగరేణి బొగ్గు గనులు ఉన్నాయి. సింగరేణిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన కుటుంబాల ఓట్లు ఈ నియోజవకర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. దీంతో టీజీబీకేఎస్ గెలుపు బాధ్యతలు పరోక్షంగా ఇల్లెందులో హరిప్రియానాయక్, మణుగూరులో రేగా కాంతారావు, కొత్తగూడెంలో వనమా వెంకటేశ్వరరావుకు కీలకం కానున్నాయి. ఇక కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం కూడా తమ అభ్యర్థులను ప్రకటిస్తే అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు గుర్తింపు సంఘం ఎన్నికల ద్వారా ఆయ పార్టీల తమ సత్తాను చాటాల్సి ఉంటుంది.

మరో చాన్స్ కోరడం విడ్డూరం

- కాంగ్రెస్‌పై ఎంపీ వద్దిరాజు ఆగ్రహం
- ఇల్లెందులో రవిచంద్రకు ఘన స్వాగతం
- ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యాన సభ



ఇల్లెందులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీలు వద్దిరాజు, కవిత, ఎమ్మెల్యే హరిప్రియ



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తూ..

ఇల్లెందు: దేశాన్ని 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందని రాజ్యసభ సభ్యులు, బీఆర్‌ఎస్ ఇల్లెందు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యాక సోమవారం తొలిసారి ఇల్లెందుకు వచ్చిన రవిచంద్ర.. ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యాన బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో, అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీ ఆర్ ఆశీస్సులతో ఎమ్మెల్యే హరిప్రియ మరోమారు ఎన్నికల బరిలో నిలుస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో ఈ నియోజకవర్గంలో 1.28 లక్షల మంది లబ్ధి పొందారని, ఇందులో 1.07 లక్షల మంది మహిళలే ఉన్నారని తెలిపారు. వీరంతా బీఆర్‌ఎస్‌కే ఓటేస్తారని, దీంతో హరిప్రియ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన కోరం కనకయ్యను తిరిగి జెడ్పీ చైర్మన్‌ను చేస్తే పార్టీకి వెన్నుపోటు పొడిచాడని ఆరోపించారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో పార్టీలోని అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగుతామని తెలిపారు. ఇల్లెందు నుంచి ఇప్పటి వరకు కారు గుర్తుపై ఎవరూ గెలువలేదని, కేసీఆర్ ఆశీస్సులతో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ ఎన్నికల్లో గెలుపు ద్వారా చరిత్రను తిరుగరాస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు.

గంగిరెద్దులోళ్లలా వస్తుంటారు..

సంక్రాంతికి వచ్చే గంగిరెద్దులోళ్లలా కొందరు ఎన్నికలప్పుడే వస్తుంటారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎంపీ కవిత అన్నారు. సీఎం కేసీఆర్ దీవెనతో హరిప్రియ మరోసారి ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారని, అందరికీ అందుబాటులో ఉండే హరిప్రియను గెలిపించాలని కోరారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ గెలిచి తీరుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఈ జిల్లాకు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, జెడ్పీటీసీ ఉమ, పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మనోహర్ తివారీ, సుధీర్‌తోత్లా, పరుచూరి వెంకటేశ్వరరావు, జేకే శ్రీనివాస్, సిలివేరు సత్యనారాయణ, జనగం కోటేశ్వరరావు, తాతా గణేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రవిచంద్రకు కార్యకర్తలు భారీగా స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అంతకుముందు మహబూబాబాద్ క్రాస్ రోడ్‌లోని సువర్చలా సహిత ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో కొమ్ము, డోలు, గిరిజన నృత్యాలు అలరించాయి.

ఫలప్రదం కాని చర్చలు

ఇల్లెందు బీఆర్‌ఎస్‌లో నెలకొన్న అసంతృప్తిపై జరిగిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఆదివారం అర్ధరాత్రి ఖమ్మంలో ఓ రహస్య ప్రదేశంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలలో చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ నాయక్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పులిగళ్ల మాధవరావుతో పాటు బయ్యారం, కామేపల్లి మండలాల నేతలు పాల్గొన్నారు. కాగా డీవీ, తాతా మధు, హరిప్రియ, హరిసింగ్ మధ్య పరస్పరం వాగ్వాదం జరిగింది. అసమ్మతి పేరుతో తనకు టికెట్ రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారంటూ తాతా మధు, డీవీపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, సోమవారం నాటి ర్యాలీకి డీవీ, మాధవరావు దూరంగా ఉండడంతో సమస్య సమసిపోలేదని తెలుస్తోంది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బీఆర్‌ఎస్ ఇల్లెందు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సోమవారం ఇల్లెందులో పర్యటించగా, ఆయనకు స్వాగతం పలుకుతూ పట్టణంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీగా హోర్డింగులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో జేకే కాలనీ నుంచి కరెంటాఫీస్ ఏరియా వరకు ఫ్లెక్సీలు కడుతుండగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు రామకృష్ణ, రాహుల్ విద్యుదాఘాతానికి గురై స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఇల్లెందు ఆస్పత్రికి తరలించగా, వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఖమ్మం రిఫర్ చేశారు. కాగా, గాయపడిన వారిని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మున్సిపల్ చైర్మన్ డీవీ పరామర్శించారు.

ముగిసిన శ్రీమద్భాగవత సప్తాహం



వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి వారికి పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ చిత్రకూట మండపంలో ఈనెల 4న ప్రారంభమైన శ్రీమద్భాగవత అష్టమ సప్తాహం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు హోమ పూజలతో పాటు వేద విన్నపాలు, భాగవత పారాయణం చేసి మహాపూర్ణాహుతితో ముగింపు పలికారు. సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

రామయ్యకు పునర్వసు పట్టాభిషేకం..

సోమవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని బేడా మండపంలో స్వామివారికి పట్టాభిషేకం కమనీయంగా జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అంతకుముందు స్వామివారి మూలమూర్తులను ముత్తంగి రూపంలో అలంకరించారు.

ల్యాబ్‌ల్లో వైద్యాధికారుల తనిఖీ



తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

పాల్వంచరూరల్ : నిబంధనలకు విరుద్ధంగా డెంగీ పరీక్షలు నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు వైద్యాధికారులు పలు ల్యాబ్‌లలో సోమవారం తనిఖీలు చేశారు. జగన్నాధపురంలోని ల్యాబ్‌లను డిప్యూటీ డీఎంహెచ్ఓ ఫయాజ్ మోహియుద్దీన్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీషకు నివేదిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాజు, నాగలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విషజ్వరాల నివారణపై ప్రత్యేక దృష్టి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



దర్బార్‌లో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో డెంగీ, ఇతర విషజ్వరాలు ప్రబలుతున్నాయని, నివారణకు వైద్యశాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ గ్రామాల గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. అర్హతల మేరకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల పట్ల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్ఓ సురేష్ బాబు, ఆర్ఓఎఫ్ఆర్ డీటీ శ్రీనివాస్, ఏపీఓ పవర్ మునీర్ పాషా, ఏడీ భాస్కరన్, ఉద్యాన వనాధికారి అశోక్ కుమార్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

భద్రాచలంఅర్బన్ : ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, సహాయ ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఓ మాట్లాడారు. జిల్లాలో గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన స్టేషన్లను గుర్తించి, ఈసారి ఓటర్లకు అవగాహన కల్పిస్తామని, ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చూస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పినపాక నియోజకవర్గంలో ఇప్పటికే ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపులు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 4,238 మందిని కొత్తగా ఓటర్‌గా నమోదు చేశామని వివరించారు. వీసీలో పినపాక నియోజకవర్గ ఎన్నికల నాయబ్ తహసీల్దార్ నాగరాజు, ఏఈఆర్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త డివిజన్లతో ప్రయోజనం

ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



కొత్తగూడెంలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో కొత్త డివిజన్ల ఏర్పాటుతో ఎంతో ప్రయోజనమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోని కొత్తగూడెం పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ఇటీవల ప్రభుత్వం పంచాయతీరాజ్‌లో కొత్త సబ్ డివిజన్లను ఏర్పాటు చేసిందన్నారు. క్వాలిటీ కంట్రోల్ కార్యాలయ ఏర్పాటుతో పనుల్లో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న పనులు అత్యంత కీలకమైనవని అన్నారు. కొత్త డివిజన్ల ఏర్పాటుతో మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ సాయిబాబు, కొత్తగూడెం పీఏసీఎస్ చైర్మన్ మండె వీరహనుమంతరావు, మాజీ జెడ్పీటీసీ గిడ్లపరంజ్యోతి, సిబ్బంది ఆంజనేయులు, కోటయ్య, ఏఈలు నాగేందర్, అనిల్ పాల్గొన్నారు. కాగా, జెడ్పీ కార్యాలయంలో ఈ కార్యాలయాన్ని ప్రారంభించగా, ఆహ్వాన పత్రికలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పేరు లేకపోవడంతో కార్యక్రమానికి వచ్చిన జెడ్పీ ఉద్యోగులు వెనుదిరిగారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్ : స్థానిక పాత ఆర్టీఓ కార్యాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీరింగ్ డీఈ కార్యాలయాన్ని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఈఈ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ డీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

'చలమల' త్యాగం చిరస్మరణీయం

ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాసరావు విగ్రహావిష్కరణ సభలో కలెక్టర్ ప్రియాంక ఆల



ఎఫ్‌ఆర్‌ఓ కుటుంబసభ్యులతో కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్ తదితరులు

చుంచుపల్లి: అడవులను సంరక్షించే క్రమంలో గుత్తికోయల దాడిలో ప్రాణాలొదిలిన ఫారెస్ట్ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావు త్యాగం మరువలేనిదని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కొత్తగూడెంలోని ఫారెస్ట్ సెంట్రల్ పార్క్‌లో ఏర్పాటుచేసిన ఎఫ్‌ఆర్‌ఓ కాంస్య విగ్రహాన్ని ఎస్పీ వినీత్‌తో కలిసి సోమవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. అడవుల సంరక్షణే ధ్యేయంగా పనిచేసిన ఉత్తమ అధికారి శ్రీనివాసరావు హత్యకు గురికావడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఈ ఘటనపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌ఓ కుటుంబానికి అండగా నిలిచిందని చెప్పారు. అటవీ, పోలీస్, న్యాయ శాఖలు సమన్వయంగా పనిచేసి ఇద్దరు నిందితులకు జీవితఖైదు పడేలా చూశారని చెప్పారు. జిల్లాలో అడవుల సంరక్షణలో భాగంగా అసువులు బాసిన అమరులను స్ఫూర్తిగా తీసుకుని అటవీ శాఖ సిబ్బంది ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శ్రీనివాసరావు కుటుంబానికి భవిష్యత్‌లోనూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ వినీత్ మాట్లాడుతూ శ్రీనివాసరావు ఆశయ సాధనకు అటవీ, పోలీస్ శాఖలు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. శ్రీనివాసరావు పట్టుదల, అంకితదీక్షతో విధులు నిర్వహించేవారని, అదే స్ఫూర్తితో సిబ్బంది వృత్తిలో రాణించాలని అన్నారు. సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడేది సైనికులైతే, నిరంతరం కష్టపడి అటవీ సంపదను కాపాడేది అటవీ సిబ్బందని అన్నారు. అడవులను సంరక్షించకుంటే మానవ మనుగడే ఉండదని అన్నారు. డీఎఫ్ఓ కిష్టాగౌడ్ మాట్లాడుతూ కొత్తగూడెం ఫారెస్ట్ సెంట్రల్ పార్క్ అభివృద్ధిలో కీలక సలహాలు ఇచ్చిన శ్రీనివాసరావు సేవల అభినందనీయమని, అలాంటి ఉత్తమ ఉద్యోగి హత్యకు గురికావడం విచారకరమని అన్నారు. శ్రీనివాసరావు కుటుంబానికి అటవీశాఖ అన్నివేళలా అండగా నిలుస్తుందని తెలిపారు. సెంట్రల్ పార్కుకు శ్రీనివాసరావు పేరు పెట్టడం, ఇప్పుడు ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం అటవీ శాఖ సిబ్బందిలో మరింత స్ఫూర్తిని నింపుతుందని చెప్పారు. అనంతరం శ్రీనివాసరావు సతీమణి భాగ్యలక్ష్మితో పాటు అటవీశాఖలో అమరులైన పలు కుటుంబాల వారిని ఎస్పీ, డీఎఫ్ఓ, అటవీశాఖ అధికారులు సన్మానించారు.

అంగన్‌వాడీల సమ్మె ప్రారంభం



బస్టాండ్ సెంటర్‌లోని సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

కొత్తగూడెంటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం నుంచి సమ్మెకు దిగారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. జిల్లాలోని 1434 మంది ప్రధాన కేంద్రాలకు చెందిన టీచర్లు, ఆయాలంతా సమ్మె చేస్తుండడంతో ఆయా సెంటర్ల పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందలేదు. తమకు వేతనాలు పెంపుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్న అంగన్‌వాడీలు కొత్తగూడెంలోని బస్టాండ్ సెంటర్, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వారికి పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు.

క్లుప్తంగా

సెంట్రల్ ఆఫీస్‌పై పక్కాగా పర్యవేక్షణ

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: కేటీపీఎస్ సెంట్రల్ ఆఫీస్ పర్యవేక్షణను అధికారులు కట్టుదిట్టం చేశారు. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తుండటంతోపాటు డ్రెస్ కోడ్ అమలు చేయకపోవడంపై ఇటీవల సాక్షిలో 'కొరవడిన సమయపాలన' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. విధుల సమయంలో ఉద్యోగులు బయటకు వెళ్లాలంటే డీవైసీసీ, ఎస్ఏఓ అనుమతి లెటర్ తీసుకుని సెక్యూరిటీ గేటు వద్ద ఇచ్చి వెళ్లాలని నిబంధన విధించారు. సెక్యూరిటీ సిబ్బంది కూడా సదరు అధికారులతో ఫోన్‌లో మాట్లాడాకనే పంపిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు గేటు మూసివేసి, ఒంటి గంటకు తెరిచి, భోజన విరామం తర్వాత 2.30 గంటలకు మళ్లీ గేటు మూసివేస్తున్నారు. తిరిగి 5గంటలకు తెరుస్తున్నారు. డ్రెస్ కోడ్‌ను పాటించేలా ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల పనితీరును కట్టుదిట్టం చేశామని సీఈ పి.వెంకటేశ్వరరావు తెలిపారు.

వినాయక మండపాలకు ఉచితంగా హోమద్రవ్యాలు



వివరాలు వెల్లడిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

కొత్తగూడెంటౌన్: వినాయక చవితి మండపాల నిర్వాహకులకు కొత్తగూడెం గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉచితంగా హోమద్రవ్యాలను అందజేస్తామని సమితి అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ తెలిపారు. సోమవారం వివేకానంద విద్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ అవకాశాన్ని కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల్లోని మండపాల నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 18వ తేదీ నుంచి వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం కానుండగా, ఈ నెల 20 నుంచి భజనమందిరం సమీపంలోని వివేకానంద విద్యాలయంలో పూజాద్రవ్యాలు అందజేస్తామని తెలిపారు. కమిటీ కార్యదర్శి దారా రమేష్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి పూజారుల సంఘం కమిటీ ఎన్నిక

పాల్వంచ: జగదాంబ మేడారం భద్రకాళి పూజారుల సంఘం నూతన కమిటీని సోమవారం స్థానిక కరకవాగు శ్రీజగదాంబదేవీ ఆలయంలో ఎన్నుకున్నారు. జాతీయ గౌరవ అధ్యక్షుడిగా కుడికాలు ఆంజనేయులు, జాతీయ అధ్యక్షుడిగా తేజావత్ రాములునాయక్, ప్రధాన కార్యదర్శిగా నూనావత్ శంకర్‌సాధు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎలుపుల ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుగులోతు కిశోర్, ఉపాధ్యక్షుడిగా కారం మోహన్, ప్రచార కార్యదర్శిగా శీలం హరిత, కోశాధికారిగా ఓడెలు, కార్యవర్గ సభ్యులుగా సీతారాంసాధు, సోంది చిరంజీవి, స్వరూప, యాకమ్మ, రాజీ తదితరులను ఎన్నుకున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దుమ్ముగూడెం : మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పౌరసఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసినా, తరలించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువకుడిపై దాడి

దమ్మపేట: వివాహ కార్యక్రమంలో కులపెద్ద కుమారుడిపై భౌతిక దాడికి పాల్పడిన సంఘటనలో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని ముష్టిబండ గ్రామానికి చెందిన కొలికపోగు సుధాకర్ అదే గ్రామంలో ఈ నెల 7న ఓ వివాహ వేడుకకు హాజరయ్యాడు. వేడుకకు హాజరైన అదే గ్రామానికి చెందిన కొలికపోగు వెంకట్రావు, సుధాకర్‌ను అపహాస్యం చేయడంతోపాటు అతని కుమారుడు సాయిరాంపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

వ్యభిచార గృహంపై...

పాల్వంచ: పట్టణంలో ఓ వ్యభిచార గృహంపై పోలీసులు సోమవారం దాడిచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రశాంత్ నగర్ కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడు, విటుడితో పాటు, ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాధిత మహిళలను సఖి హోంకు కౌన్సెలింగ్ నిమిత్తం తరలించారు. వ్యభిచార గృహం నిర్వాహకుడు, విటుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వప్న తెలిపారు.

మట్టి తరలిస్తున్న లారీ సీజ్

పాల్వంచరూరల్: అనుమతులులేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు సోమవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని తోగ్గూడెం నుంచి మట్టి తరలిస్తుండగా పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆర్ఐ హచ్యా తెలిపారు.

అర్జీలను నిశితంగా పరిశీలించాలి

ప్రజావాణిలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేస్తున్న దరఖాస్తులను నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్ఓ రవీంద్రనాథ్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొన్నింటి వివరాలిలా..

- మణుగూరు, అశ్వాపురం మండలాల్లో డెంగీ జ్వరం నివారణకు చర్యలు చేపట్టాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి నాసర్‌పాషా, న్యూడెమోక్రసీ జిల్లా నాయకురాలు పెదగోని ఆదిలక్ష్మి ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.
- పాతపాల్వంచకు చెందిన పెరుమాళ్ల మరియమ్మ తాము కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నామని కిరాయి ఇంట్లో అద్దెకట్టే పరిస్థితి లేదని తమకు డబుల్‌బెడ్ రూం కేటాయించాలని చేసిన దరఖాస్తును డీఆర్ఓకు ఎండార్స్ చేశారు.
- తన భర్త మృతి చెందడంతో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సాయం మంజూరు చేయాలని కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరానికి చెందిన మహమూదా బేగం అర్జీ పెట్టుకోగా డీఎంఓకు ఎండార్స్ చేశారు.

వీసీకి హాజరైన కలెక్టర్

ఓటరు సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన ఓటరు నమోదు, జాబితాలో సవరణల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ నమోదు తదితర వివరాలను తెలిపారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ట్రాన్స్‌జెండర్లు, కళాశాలల్లో తరచూ స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఓటరు నమోదు, సవరణలపై ప్రజలను చైతన్యం చేసే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఆదివాసీ గ్రామాల ఓటరు నమోదుపై అవగాహనా కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు శిరీష, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి రండి..

తుమ్మలకు ఆహ్వానం పలికిన పొదెం



విలేకరులతో మాట్లాడుతున్న పొదెం వీరయ్య, పక్కన తుమ్మల, నాయకులు

దమ్మపేట: కాంగ్రెస్‌లో చేరాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆహ్వానించారు. దమ్మపేట మండలం గండుగులపల్లి నివాసంలో తుమ్మలను వీరయ్య సోమవారం కలిశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొదెం మాట్లాడుతూ మచ్చలేని మంచి నాయకుడిగా పేరున్న తుమ్మలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడానికి డీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చానని తెలిపారు. ఆయన పార్టీలో చేరితే జిల్లాలో ఫలితం మెరుగయ్యే అవకాశముందని పేర్కొన్నారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు ఆహ్వానించిన వీరయ్య కృతజ్ఞతలు తెలిపారు. అయితే, తనతో కలిసి నడిచిన మిత్రులు, అనుచరులు, అభిమానుల సూచనలు స్వీకరించాకే నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నాయకులు యడవల్లి కృష్ణ, దేవి ప్రసూన, సున్నం నాగమణి, వగ్గెల పూజ, మహ్మద్ ఖాన్, చింతిరాల రవికుమార్, మద్దిశెట్టి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జేకే ఓసీ సర్వే అడ్డగింత



సర్వే అధికారులతో చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతమైన విజయలక్ష్మీనగర్‌లో గృహ సర్వేకు వచ్చిన సింగరేణి, రెవెన్యూ అధికారులను నిర్వాసితులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సోమవారం అడ్డుకున్నారు. 21 పిట్ ఏరియాలోని విజయలక్ష్మీనగర్‌ను పూర్తిగా, మరికొంత ప్రాంతాన్ని పాక్షికంగా నిర్వాసిత ప్రాంతంగా గుర్తిస్తున్నట్లు గతంలో సింగరేణి అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో నిర్వాసిత ప్రాంతం ఎంత వరకు ఉంటుందనే విషయం, బాధితులకు ఇచ్చే ప్యాకేజీ వివరాలపై స్పష్టత ఇవ్వకుండా సర్వేను సాగనివ్వబోమని స్థానికులు పేర్కొన్నారు. తరతరాలుగా ఇక్కడే ఉంటున్న ప్రజలకు న్యాయం చేయాలని, రేషన్‌కార్డుల ఆధారంగా కుటుంబాలను గుర్తిస్తామని పేర్కొనడం సరికాదని అన్నారు. ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, ఈ వ్యవధిలో విడిపోయిన కుటుంబాలకు అన్యాయం చేయొద్దని ఎంపీటీసీ పూనెం సురేందర్ కోరారు. పురాతన సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారికి, ఇళ్లు కూలిపోయిన వారికి కూడా ప్యాకేజీ వర్తింపజేయాలని పట్టుబట్టారు. ఉన్నతాధికారులు నిర్వాసితులతో సమావేశమై పూర్తిస్థాయిలో సందేహాలను నివృత్తి చేశాకే సర్వే చేపట్టాలని పేర్కొన్నారు. దీంతో అధికారులు సర్వే నిలిపివేసి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మినగర్, తిలక్‌నగర్ సర్పంచ్‌లు పూనెం కవిత, ధనసరి స్రవంతి, ఉపసర్పంచ్ తాండ్ర నాగరాజు, రాజకీయ నాయకులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెంరూరల్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని బూడిదగడ్డ రెండో వార్డులో నిర్వహించిన గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణ టీఆర్ఎస్‌తోనే సాధ్యమని గొప్పలు చెప్పిన కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రంలోని ప్రజల సొమ్మును దోచుకుంటోందని, రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. తొలుత రెండో వార్డులో కాంగ్రెస్ నాయకుడు తాండ్ర నాగబాబు ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని పొంగులేటి ప్రారంభించారు. అనంతరం వంద కుటుంబాలవారు కాంగ్రెస్‌లో చేరగా, వారికి పొంగులేటి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు ఊకంటి గోపాలరావు, నాగా సీతారాములు, ఆళ్ల మురళి, తూము చౌదరి, నాగేంద్రత్రివేది, లింగం పిచ్చిరెడ్డి, తాండ్ర నాగబాబు, గుడ్ల ఉమ, రావూరి వీరభద్రం, మారెడ్ల నరసింహారెడ్డి, బాల ప్రసాద్, గుడివాడ రామ లక్ష్మణ్, గౌస్, ఆయూబ్, సుందర్‌లాల్‌కోరి, నిరంజన్ రెడ్డి, దుర్గారాశి సతీష్, మున్నా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల వెంకటేశ్వరరావు మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తదితరులు

పాల్వంచ: పట్టణానికి చెందిన వ్యాపారి, రచయిత నాదెండ్ల(నవత) వెంకటేశ్వరరావు మృతి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం మదర్‌థెరిస్సా బీఈడీ కళాశాల ప్రాంగణంలో పట్టణ ప్రముఖులు వెంకటేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, బీఆర్ఎస్ నాయకులు కోనేరు సత్యనారాయణ తదితరులు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలువురు వ్యాపార రంగంలో రాణించేలా వెంకటేశ్వరరావు ప్రోత్సహించారని గుర్తుచేశారు. రచయితగా, కళాకారునిగా, వర్తక సంఘ బాధ్యులుగా సేవలందించారని కొనియాడారు. వైద్యులు రమేశ్‌బాబు, నాగరాజు, ముక్కంటేశ్వరరావు, బుచ్చయ్య, సుధాకర్‌రావు, మదర్ థెరిస్సా కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

అదనపు కలెక్టర్ రాంబాబు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జిల్లాల్లోని అన్ని మున్సిపాలిటీలు, మండలాలస్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. మండపాలకు విద్యుత్ కోసం విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి వినియోగించే వాహనాలకు రవాణాశాఖ అధికారి నుంచి ధ్రువీకరణ తీసుకోవాలని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా భక్తిపాటలు మాత్రమే వినిపించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రవీంద్రనాథ్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీపీఓ రమాకాంత్, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కె.రంగాకిరణ్, దారా రమేష్, వందనపు శ్రీధర్, జి వెంకటేశ్వరరావు, చింతల చెరువు శ్రీనివాసరావు, జల్లారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యుడిగా నవీన్‌కుమార్

కొత్తగూడెంటౌన్: జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రుద్రంపూర్‌కు చెందిన నవీన్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 10న తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో సాఫ్ట్‌బాల్ క్రీడ అభివృద్ధికి, క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

సుజాతనగర్: నిజాం పాలనకు, దొరలు, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా నాడు కమ్యూనిస్టులు తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గుర్తుచేశారు. నాయకులగూడెం గ్రామంలో సోమవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. తొలుత సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డిస్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నాటి దొరలు, రజాకార్ల మూకల దోపిడీ, దౌర్జన్యాలకు ఎదురొడ్డి తమ ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ ప్రజలకు రక్షణగా నిలిచింది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల కోసం ముఖ్యంగా రైతాంగ సమస్యలకోసం, రజాకారుల రాజకీయ పాలనను అంత మొందించడంలో సీపీఐ కీలకపాత్ర పోషించిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ అమరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకొని ప్రజావ్యతిరేక పాలకులపై తిరగబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్, దమ్మాలపాటి శేషయ్య, భూక్య దస్రు, వాసిరెడ్డి మురళి, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, భూక్య దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, తాళ్లూరు పాపారావు, తాళ్లూరి ధర్మారావు, వేల్పుల భాస్కర్, నాగయ్య, కొమారి కృష్ణ, కత్తి వెంకన్న పాల్గొన్నారు.

36 కేజీల గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు కథనం ప్రకారం... ఢిల్లీకి చెందిన షర్మిల, బుద్ధుతో పాటు మరో బాలుడు కలిసి ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో 36 కిలోల గంజాయి కొనుగులో చేసి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.7.20 లక్షలు ఉంటుందని, ఈ ఘటనలో శాబీర, తోటారం, సారిక, ఇదౌని, షకీలా లాల్ అనే ఐదుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారని సీఐ నాగరాజు రెడ్డి, ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

నిందితుల్లో ఇద్దరు మహిళలు

కొత్తగూడెంటౌన్: చోరీ కేసులో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ రమేష్ కథనం ప్రకారం.. కొన్ని రోజుల క్రితం 2 ఇంక్‌లైన్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో రామవరం 2 ఇంక్‌లైన్‌కు చెందిన ఆడెపు క్రాంతికుమార్, పాల స్పందన, వేణుగోపాల్ టెంపుల్ ఏరియాకు చెందిన బండి పోచమ్మలను అరెస్టు చేశారు. వారి నుంచి గృహోపకరణ వస్తువులు, టీవీలు, రూ.46,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు.

యువకుడి మృతితో విషాదం



సందీప్ (ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామ పంచాయతీలోని గోపాలపురం గ్రామానికి చెందిన యువకుడు మందలపు సందీప్(25) సోమవారం మృతి చెందాడు. ఎదిగిన ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో గ్రామంలో విషాదం నెలకొంది. సందీప్ ఆస్ట్రేలియాలో మాస్టర్ డిగ్రీ ఇటీవల పూర్తి చేశాడు. బాబాయి నూతన ఇంటి గృహప్రవేశం సందర్భంగా ఆస్ట్రేలియా నుంచి ఇటీవల గోపాలపురం వచ్చాడు. నాలుగు రోజుల క్రితం జ్వరం రాగా భద్రాచలం లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డెంగీ నిర్ధరణ కావడంతో విజయవాడ తరలించారు. చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పెద్ద చదువులు చదివి ఉద్యోగం చేసే సమయంలో కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సందీప్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డెంగీతో యువకుడు మృతి



రాకేష్ (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో డెంగీతో యువకుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు, త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం... చుంచుపల్లి మండలం రాంనగర్‌కు చెందిన మందా రాకేష్(25), తండ్రి మందా వెంకటేశ్వర్లు ఈ నెల 7వ తేదీ నుంచి డెంగీ జ్వరంతో బాధపడుతున్నారు. దీంతో చికిత్స కోసం ఇద్దరు గణేష్‌టెంపుల్ ఏరియాలోని అమృత అనే ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. 10న మధ్యాహ్నం రాకేష్‌కు కడుపునొప్పి రావడంతో, వైద్యుల సూచన మేరకు బయట స్కానింగ్ తీసుకుని వస్తుండగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అనంతరం ఆస్పత్రి వైద్యులు బాబూరావు రాకేష్‌కు చికిత్సను అందించి బీపీ డౌన్ అవుతోందంటూ సీపీఆర్ చేశారు. ప్లేట్‌లెట్లు తగ్గి, హార్ట్‌స్టోక్ వచ్చి చనిపోయాడని తెలిపారు. కాగా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రాకేష్ మృతి చెందాడని, సరైన వైద్యం అందించి ఉంటే బతికి ఉండేవాడని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి సామగ్రి, వస్తువులను ధ్వంసం చేశారు. ఆస్పత్రి వైద్యులు, మృతుడి కుటుంబ సభ్యులు పరస్పరం ఫిర్యాదు చేయగా, ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నారు. కాగా మంగళవారం రాకేష్ మృతదేహానికి సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయనున్నారు.

కుమారుడిని చూడనివ్వలేదని

ఉరేసుకుని తండ్రి ఆత్మహత్య



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: కుమారుడిని చూడనివ్వలేదని మనస్తాపం చెంది తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన కొత్తగూడెం టూటౌన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం పరిధిలోని నేతాజీబస్తీకి చెందిన సింగారపు భరత్‌కుమార్, సుభద్రలకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ప్రేమ్ కుమార్ (32) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా కూడా నటిస్తున్నాడు. ఇతనికి హైదరాబాద్ బోడుప్పల్‌కు చెందిన యువతితో వివాహం కాగా, వారికి ఐదేళ్ల బాబు చెర్రీ ఉన్నాడు. ప్రేమ్ దంపతుల మధ్య గొడవలు జరుగుతుండగా, భార్య ఐదు నెలల క్రితం పుట్టింటికి వెళ్లి, అక్కడే ఉంటోంది. అయితే కుమారుడిని చూసేందుకు వెళ్లగా అవమానించారంటూ ప్రేమ్ బాధపడుతుండేవాడని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తమ్ముడు రాజ్‌కుమార్ అర్ధరాత్రి నిద్రలేచి చూడగా ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రేమ్ కళ్లు దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆస్పత్రి సామగ్రి ధ్వంసంపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: పాతబస్‌డిపో సెంటర్‌లోని నాగరాజు ఆస్పత్రిలో సామగ్రిని ధ్వంసం చేసిన వ్యక్తిపై త్రీటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ప్రేమ్‌కుమార్ ఉరివేసుకోగా కుటుంబ సభ్యులు నాగరాజు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రేమ్‌కుమార్ మృతి చెందాడని నిర్ధారించారు. కాగా మృతుడి మరో సోదరుడు కిరణ్ ఆవేశంతో ఆస్పత్రిలోని రూ.2 లక్షల విలువైన పరికరాన్ని ధ్వంసం చేశాడు. ఆస్పత్రి సిబ్బంది అజీజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురు మృతి

- ఘటనాస్థలంలోనే ఇద్దరు..
- ఆస్పత్రిలో మరొకరు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు రోళ్లపాడు గ్రామస్తులు





మడే నాగరాజు, కొడెం సంతోష్ మృతదేహాలు



భూక్యా లక్ష్మణ్ (ఫైల్)

టేకులపల్లి : మండలంలోని రోళ్లపాడు క్రాస్‌రోడ్ సమీపంలో సోమవారం రాత్రి 10 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. మృతుల్లో ఇద్దరు రోళ్లపాడు గ్రామానికి చెందిన వారు కాగా, మరొకరిది లచ్చిరాం తండా. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చిరాం తండాకు చెందిన ఫొటోగ్రాఫర్ భూక్యా లక్ష్మణ్ (40) ఇల్లెందు నుంచి టేకులపల్లి వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, రోళ్లపాడు గ్రామానికి చెందిన కొడెం సంతోష్ (28), మడే నాగరాజు (30) కొత్తగూడెం నుంచి స్వగ్రామానికి మరో బైక్‌పై వస్తున్నారు. రోళ్లపాడు క్రాస్‌రోడ్ సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భూక్యా లక్ష్మణ్, మాడె నాగరాజు అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన కొడెం సంతోష్‌ను ఇల్లెందు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. లక్ష్మణ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉండగా, సంతోష్, నాగరాజుకు ఇంకా పెళ్లి కాలేదు. వీరిద్దరిదీ ఒకే గ్రామం కావడంతో రోళ్లపాడులో తీవ్ర విషాదం నెలకొంది. టేకులపల్లి ఎస్సై రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.